మే 26న సివిల్స్ ప్రిలిమ్స్

1,056 ఖాళీలు భర్తీ

- మార్చి 5 వరకు దరఖాస్తులు
- సెప్టెంబర్ 20 నుంచి మెయిన్స్
- 2024-సివిల్స్ నోటిఫికేషన్ విడుదల

యూపీఎస్సీ-2024 ముఖ్య తేదీలు

దరఖాస్తుల స్వీకరణ	ఫిబ్రవరి 14
దరఖాస్తుకు చివరితేదీ	మార్చి 5
అడ్మిట్ కార్డ్ జారీ	మే
ప్రిలిమ్స్ పరీక్ష	మే 26
ప్రిలిమ్స్ ఫలితాలు	జూన్
మెయిన్స్ పరీక్షలు	సెప్టెంబర్ 20 నుంచి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: దేశవ్యాప్తంగా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు గుడ్ న్యూస్. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్, ఐఎఫ్ఎస్ వంటి ప్రతిష్ఠాత్మకమైన ఉద్యోగాల భర్తీ కోసం ఏటా నిర్వహించే సీఎస్ఈ (సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్), ఐఎఫ్ఎస్(ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్ ఎగ్జామ్)-2024 నోటిఫికేషన్లను యూపీఎస్సీ బుధవారం విడుదల చేసింది. ఈ ఏడాది సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షను మే 26న, మెయిన్స్‌ను సెప్టెంబర్ 20 నుంచి (ఐదు రోజులు) నిర్వహిస్తామని నోటిఫికేషన్లో పేర్కొన్నది. ఈ ఏడాది అఖిల భారత సర్వీసుల్లో మొత్తం 1,056 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్టు తెలిపింది. ఈ పరీక్ష ద్వారా ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్, ఐఐఎస్ వంటి 21 రకాల పోస్టులను యూపీఎస్సీ భర్తీ చేయనున్నది. ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్-2024 నోటిఫికేషన్ ద్వారా ఈసారి 150 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఫిబ్రవరి 14 నుంచి మొదలైన దరఖాస్తుల స్వీకరణ మార్చి 5 సాయంత్రం 6 గంటలతో ముగుస్తుందని యూపీఎస్సీ పేర్కొన్నది. అభ్యర్థులు ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

తడారిన బెంగళూరు

వేసవికి ముందే నగర ప్రజలకు తాగునీటి కష్టాలు

- వాటర్ ఏటీఎంలు, ఆర్వో యూనిట్ల మూసివేత
- అడ్డగోలుగా దోచుకొంటున్న ట్యాంకర్ల మాఫియా
- బళ్లారి తదితర జిల్లాల్లోనూ తాగునీటికి కష్టాలు
- అసెంబ్లీలో కాంగ్రెస్ సర్కారును నిలదీసిన విపక్షాలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 14 (నమస్తే తెలంగాణ): సిలికాన్ సిటీ ఆఫ్ ఇండియాగా పేరున్న బెంగళూరులో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. కాలనీలకు పదిరోజులకొకసారి కూడా నీటి సరఫరా జరుగకపోవడంతో ప్రజలు నీటికోసం అల్లాడిపోతున్నారు. ప్రతీ ఇంటిముందు నాలుగైదు డ్రమ్ములు, సింథటిక్ ట్యాంకులు దర్శనమిస్తున్నాయి. వేసవి రాకముందే తాగునీటికి ఇబ్బందులు ఇలా ఉంటే మరికొన్ని రోజులు అయ్యాక పరిస్థితి ఏమిటని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగరంలోని 25 శాతం మేర నీటి అవసరాలను తీరుస్తున్న నీటి ట్యాంకర్ల యజమానులు కూడా ధరలను అమాంతం పెంచేశారని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. వాటర్ మాఫియా చెలరేగిపోతున్నప్పటికీ, ప్రభుత్వం చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. ఇక, మంచినీటి లభ్యత లేకపోవడంతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు, ఆర్వో యూనిట్లను ప్రభుత్వం మూసివేసింది. పనిచేస్తున్న ఒకటీ, రెండు యూనిట్లలో నీటి చార్జీలను రెట్టింపు చేసింది. దీంతో ప్రభుత్వ వైఖరిపై పాదచారులు, రోడ్డు మీద వ్యాపారాలు చేసుకొనే స్ట్రీట్ వెండర్స్ మండిపడుతున్నారు. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయాల్సిందిపోయి.. డబ్బులు పిండుకోవడమేంటని ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. ఉమ్మడి బళ్లారి తదితర జిల్లాల్లోనూ తాగునీటి కష్టాలు పెరిగాయి. పంపుసెట్ల దగ్గర ఉప్పునీటి కోసం కూడా ప్రజలు గంటలకొద్దీ వేచిచూసే దుస్థితి దాపురించింది.

బెంగళూరులో తాగునీటి కోసం ట్యాంకర్ వద్ద గుమికూడిన మహిళలు (ఫైల్)

సభలో గరం

బెంగళూరు నగరంలో తలెత్తిన తాగునీటి సమస్యలపై మంగళవారం శాసనసభలో నగరాభివృద్ధి మంత్రి డీకే శివకుమార్‌ను విపక్ష సభ్యులు నిలదీశారు. ఫిబ్రవరి ముగుస్తున్నప్పటికీ కావేరి జలాలు బెంగళూరువాసులకు అందని దుస్థితి నెలకొన్నదని మండిపడ్డారు. దీనిపై స్పందించిన డీకే.. బెంగళూరుకు తాగునీటి సరఫరా పెద్ద సమస్యగా మారిందని, దాన్ని పరిష్కరించాల్సిన అవసరమున్నదని చెప్పారు. నగరంలో 25 శాతం నివాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఇప్పటికీ మురికివాడలకు నెలకు 10 వేల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. తాగునీటి ధరల పెంచలేదని తెలిపారు. సాధ్యమైనంత త్వరగా నీటి కష్టాలను పరిష్కరిస్తామని హామీనిచ్చారు.

కేజ్రీవాల్‌కు ఆరోసారి ఈడీ సమన్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: మనీ లాండరింగ్ కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి సమన్లు పంపింది. ఈ కేసులో ఈడీ నుంచి కేజ్రీవాల్‌కు సమన్లు జారీకావటం ఇది 6వ సారి. ఫిబ్రవరి 19న ఏజెన్సీ కార్యాలయంలో విచారణకు ప్రత్యక్షంగా హాజరుకావాలని సమన్లలో ఈడీ పేర్కొన్నది. కేజ్రీవాల్ దర్యాప్తునకు హాజరు కాకపోవటాన్ని ప్రశ్నిస్తూ ఈడీ కొద్ది రోజుల క్రితం ఢిల్లీ కోర్టును ఆశ్రయించింది. దీనిపై ఫిబ్రవరి 17న తమ ముందు హాజరుకావాలని కోర్టు సీఎం కేజ్రీవాల్‌ను ఆదేశించింది. ఈ ఏడాది జనవరి 3, జనవరి 18, ఫిబ్రవరి 2, గత ఏడాది నవంబర్ 2, డిసెంబర్ 21న ఈడీ నుంచి కేజ్రీవాల్‌కు సమన్లు జారీ అయ్యాయి. ఈ నోటీసులు చట్టవిరుద్ధమంటూ ఆయన వాటిని తిరస్కరిస్తున్నారు.

పాక్ తదుపరి ప్రధానిగా షెహబాజ్!

- నవాజ్ షరీఫ్ పార్టీకి బిలావల్ భుట్టో మద్దతు

ఇస్లామాబాద్: సార్వత్రిక ఎన్నికల్లో ఏ పార్టీకీ పూర్తి మెజార్టీ రాకపోవటంతో.. పాకిస్థాన్‌లో ప్రధాన పార్టీలన్నీ ఒక కూటమిగా ఏర్పడటానికి సిద్ధమయ్యాయి. నవాజ్ షరీఫ్ ప్రధాని అవుతారని అందరూ భావించగా, మంగళవారం అర్ధరాత్రి అనూహ్యంగా ఆయన సోదరుడు షెహబాజ్ షరీఫ్ పేరు తెరపైకి వచ్చింది. నవాజ్ షరీఫ్ పార్టీ పీఎంఎల్-ఎన్‌కు బిలావల్ భుట్టోకి చెందిన పీపీపీ పార్టీ మద్దతు ప్రకటించింది. సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నామని ఆసిఫ్ అలీ జర్దారీ, షెహబాజ్ షరీఫ్ సంయుక్తంగా ప్రకటించారు. దేశాన్ని ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడేయటమే తమ సంకీర్ణ కూటమి ప్రధాన లక్ష్యమని ప్రకటించారు. జాతీయ అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయాలంటే 169మంది సభ్యుల మద్దతు అవసరం. ఇదిలా ఉండగా, ఈ ఎన్నికల్లో తమ పార్టీ మద్దతుతో స్వతంత్రులు అత్యధిక స్థానాలు గెలుచుకున్నారని, తమకు 180మంది సభ్యుల మద్దతుందని ఇమ్రాన్‌ఖాన్‌కు చెందిన పీటీఐ ప్రకటించింది.

యూపీలో కాంగ్రెస్‌కు షాక్

- పార్టీని వీడిన మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనుమడు

లక్నో, ఫిబ్రవరి 14: లోక్‌సభ ఎన్నికల ముంగిట కాంగ్రెస్ పార్టీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. కీలక నేతలు ఒక్కొక్కరుగా పార్టీని వీడుతున్నారు. తాజాగా ఉత్తర ప్రదేశ్‌లో మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి మనుమడు విభాకర్ శాస్త్రి కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి, బీజేపీలో చేరారు. బుధవారం లక్నోలో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు భూపేందర్ సింగ్, డిప్యూటీ సీఎం బ్రజేశ్ పాఠక్‌ల సమక్షంలో బీజేపీ కండువా కప్పుకున్నారు. మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి, ఆయన కుటుంబం పేరు చెప్పుకొని కాంగ్రెస్ పార్టీ లబ్ధిపొందిందని బ్రజేశ్ చెప్పారు.

తెలంగాణ హైకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు!

- సుప్రీం కొలీజియం సిఫారసు
- బదిలీపై రానున్న జస్టిస్ సుజయ్ పాల్, జస్టిస్ మౌసమీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: తెలంగాణ హైకోర్టుకు ఇద్దరు కొత్త జడ్జీలు రానున్నారు. కలకత్తా హైకోర్టు జడ్జి జస్టిస్ మౌసమీ భట్టాచార్య, మధ్యప్రదేశ్ హైకోర్టు జడ్జి జస్టిస్ సుజయ్ పాల్‌ను తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం బుధవారం కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. అలాగే కేరళ హైకోర్టు జడ్జి అను శివరామన్‌ను కర్ణాటక హైకోర్టుకు బదిలీ చేయాలని కోరింది. ఈ మేరకు ఇతర హైకోర్టులకు బదిలీ చేయాలన్న ఆయా న్యాయమూర్తుల విన్నపాన్ని ఆమోదించినట్టు కొలీజియం తెలిపింది. 'కలకత్తా హైకోర్టు నుంచి మరో హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ మౌసమీ భట్టాచార్య కోరారు. జస్టిస్ అను శివరామన్‌ను కేరళ హైకోర్టు నుంచి కర్ణాటక హైకోర్టుకు పంపుతున్నాం. మధ్యప్రదేశ్ హైకోర్టులో తన కుమారుడు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నందున, అక్కడ్నుంచి బదిలీ చేయాలని జస్టిస్ సుజయ్ పాల్ కోరారు. న్యాయ పరిపాలన సౌలభ్యం కోసం వీరిని బదిలీ చేయడానికి ఆమోదిస్తున్నాం' అని కొలీజియం పేర్కొన్నది.

లోక్‌సభ ఎన్నికలకు 3.4 లక్షల కేంద్ర బలగాలు: ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ, నాలుగు రాష్ట్రాల శాసన సభల ఎన్నికల నిర్వహణ కోసం 3.4 లక్షల మంది సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్ (సీఏపీఎఫ్) సిబ్బంది అవసరమని ఎన్నికల కమిషన్ (ఈసీ) కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఎన్నికల సిబ్బంది విధి నిర్వహణకు ఆటంకాలు లేకుండా రైళ్లలో అన్ని సదుపాయాలు కల్పించాలని తెలిపింది. సిబ్బందిని దశలవారీగా వివిధ ప్రాంతాలకు తరలించవలసి ఉంటుందని చెప్పింది. ఓటర్లలో నమ్మకాన్ని పెంచే చర్యలు, పోలింగ్ రోజున నిర్వహించే విధులు, ఈవీఎంల భద్రత, స్ట్రాంగ్ రూమ్స్ భద్రత వంటి విధుల్లో సీఏపీఎఫ్ సిబ్బందినే నియమించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్స్ కోరారని కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖకు పంపిన లేఖలో వెల్లడించింది. ఎన్నికలు స్వేచ్ఛగా, న్యాయంగా, శాంతియుతంగా జరగడం కోసం సుమారు 3,400 కంపెనీల సీఏపీఎఫ్ సిబ్బందిని దశలవారీగా మోహరించాలని నిర్ణయించినట్లు తెలిపింది. లోక్‌సభ ఎన్నికలతోపాటు ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఒడిశా, సిక్కిం శాసన సభల ఎన్నికలు కూడా త్వరలో జరుగుతాయి.

ఎలక్టోరల్ బాండ్లపై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: రాజకీయ పార్టీలకు విరాళాల్లో పారదర్శకత తీసుకొచ్చే పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం తీర్పు వెలువరించనున్నది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం గత ఏడాది నవంబర్ 2న ఈ అంశంపై తీర్పును రిజర్వ్ చేసింది. 2018 జనవరి 2న కేంద్రం ఈ పథకాన్ని నోటిఫై చేసింది.

ఎన్నికల కమిషనర్ పదవీ విరమణ

ఈసీలోని ముగ్గురు కమిషనర్లలో ఒకరైన అనూప్ చంద్ర పాండే (65) బుధవారం పదవీ విరమణ చేశారు. దీంతో అత్యంత కీలక సమయంలో ఎన్నికల కమిషనర్ పదవి ఖాళీ అయింది. పాండే 2021 జూన్‌లో ఈసీలో చేరారు.

దక్షిణాది మెడపై కత్తి

నియోజకవర్గాల పునర్విభజనకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ తీర్మానం

చెన్నై: జమిలి ఎన్నికలు, పార్లమెంటు నియోజకవర్గాల పునర్విభజన ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ తమిళనాడు శాసన సభ బుధవారం రెండు తీర్మానాలను ఆమోదించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ మాట్లాడుతూ, జనాభా లెక్కల ఆధారంగా 2026 తర్వాత చేపట్టాలనుకుంటున్న పార్లమెంటరీ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను చేపట్టవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రాతిపదికపై నియోజకవర్గాలను విభజించడం వల్ల దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంటులో తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది దక్షిణ భారత దేశం మెడపై వేలాడే కత్తి అని అభివర్ణించారు. అనివార్య కారణాల వల్ల జనాభా ప్రాతిపదికన పార్లమెంటులో స్థానాల సంఖ్యను పెంచవలసి వస్తే, రాష్ట్రాల శాసన సభలు, పార్లమెంటు ఉభయ సభల్లోని నియోజకవర్గాల మధ్య ప్రస్తుతం ఉన్న నిష్పత్తిని కొనసాగించాలని కోరారు. గడచిన 50 ఏళ్ల నుంచి వివిధ సాంఘిక, ఆర్థిక అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న తమిళనాడు వంటి రాష్ట్రాలను శిక్షించవద్దని ఈ తీర్మానంలో కోరారు.

జమిలి ఎన్నికలపై...

'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' విధానానికి వ్యతిరేకంగా ప్రవేశపెట్టిన తీర్మానంపై స్టాలిన్ మాట్లాడుతూ, జమిలి ఎన్నికలను నిర్వహించడం ప్రజాస్వామ్యానికి వ్యతిరేకమని, ఆచరణ సాధ్యం కాదని, రాజ్యాంగంలో దీని గురించి చెప్పలేదని అన్నారు. దీనిని అమలు చేయవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. భారత దేశం వంటి విశాలమైన దేశంలో ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్రాల శాసన సభలకు వేర్వేరు సమయాల్లో ఎన్నికలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రాజస్థాన్ నుంచి రాజ్యసభకు సోనియా

- నామినేషన్ దాఖలు చేసిన కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు
- గుజరాత్ నుంచి నడ్డా పోటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ బుధవారం రాజస్థాన్ నుంచి రాజ్యసభ ఎన్నికలకు తన నామినేషన్ దాఖలు చేశారు. మరోవైపు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో పాటు కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ఎల్ మురుగన్, ఇటీవలే పార్టీలో చేరిన మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్ చవాన్‌లను పార్టీ రాజ్యసభకు నామినేట్ చేసింది. నామినేషన్ల గడువు ముగియటానికి ముందు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు తమ బలం ప్రకారం గెలుస్తామనుకున్న స్థానాలకు అభ్యర్థులను ప్రకటించాయి. బీజేపీ తరుపున 28 మంది, కాంగ్రెస్ తరుపున 10 మంది అభ్యర్థులు ఖరారయ్యారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన పది మంది అభ్యర్థుల్లో కర్ణాటక నుంచి పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్, హిమాచల్ ప్రదేశ్‌లోని ఏకైక స్థానానికి సీనియర్ నేత, న్యాయవాది అయిన అభిషేక్ సింఘ్వీ, తెలంగాణ నుంచి రేణుకా చౌదరి ఉన్నారు. 77 ఏండ్ల సోనియా రాజస్థాన్ నుంచి తొలిసారిగా ఎగువ సభలో అడుగు పెట్టనున్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పదవీ కాలం ముగియటంతో ఖాళీ అయిన స్థానాన్ని సోనియాగాంధీ భర్తీ చేస్తున్నారు. సోనియా రాజ్యసభకు పోటీచేయటమంటే ఆ పార్టీ తన ఓటమిని ముందే ఒప్పుకున్నట్టు అని బీజేపీ వ్యాఖ్యానించింది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్ కాంగ్రెస్ పార్టీని వీడిన మరుసటి రోజే అతనిని బీజేపీ రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించింది. మాజీ కేంద్ర మంత్రి ప్రఫుల్ పటేల్‌ను అజిత్‌పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ నామినేట్ చేసింది. బీజేపీ తరుపున మొత్తం 28 మంది ఎంపీలు రాజ్యసభ నుంచి నిష్క్రమిస్తుండగా.. వారిలో కేవలం నలుగురికి మాత్రమే బీజేపీ తిరిగి అవకాశం కల్పించింది. అందులో పార్టీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా, ఇద్దరు కేంద్ర మంత్రులతో పాటు జాతీయ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది ఉన్నారు. బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా హిమాచల్ ప్రదేశ్ నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావటంతో నడ్డా ఈ సారి గుజరాత్ నుంచి రాజ్యసభకు నామినేట్ అవుతున్నారు. మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్ నిరుడు హర్యానా నుంచి రాజ్యసభకు పోటీ చేసి ఓడిపోయారు. ఇప్పుడు ఆయన కాంగ్రెస్ పాలిత రాష్ట్రమైన కర్ణాటక నుంచి బరిలోకి దిగారు. ఖాళీ అయిన 56 రాజ్యసభ స్థానాలకు ఫిబ్రవరి 27న ఎన్నికలు జరుగనున్నాయి. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఫిబ్రవరి 15.

వెనక్కి తగ్గేది లేదు!

- రెండో రోజూ అన్నదాతల 'చలో ఢిల్లీ' మార్చ్
- పంజాబ్-హర్యానా సరిహద్దులో ఉద్రిక్తత
- రైతులపై టియర్‌గ్యాస్ ప్రయోగించిన పోలీసులు
- నేడు కేంద్రమంత్రులతో మరోసారి అన్నదాతల చర్చలు

పోలీసులు టియర్ గ్యాస్ ప్రయోగించడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న రైతులు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 14: తమ డిమాండ్ల సాధన కోసం అన్నదాతలు చేపట్టిన 'చలో ఢిల్లీ' మార్చ్ బుధవారం రెండో రోజుకు చేరుకున్నది. ట్రాక్టర్లతో దేశ రాజధానిలోకి ప్రవేశించేందుకు అన్నదాతలు శతవిధాలుగా ప్రయత్నిస్తున్నారు. వీరిని పోలీసులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో పంజాబ్-హర్యానా సరిహద్దులోని శంభు వద్ద తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. బారికేడ్లను తొలగించేందుకు యత్నించిన రైతులపై పోలీసులు భాష్పవాయువును ప్రయోగించారు. పోలీసులపై రైతులు రాళ్లు రువ్వారు. జింద్ జిల్లాలోనూ ఇదే తరహా పరిస్థితి నెలకొన్నది. పంటల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, రైతుల రుణాలు మాఫీ చేయాలన్న డిమాండ్‌తో సంయుక్త కిసాన్ మోర్చా (నాన్ పొలిటికల్), కిసాన్ మజ్దూర్ మోర్చా 'చలో ఢిల్లీ' మార్చ్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. దీంతో ఢిల్లీ సరిహద్దుల్లో పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. భారీగా బలగాలను మోహరించారు. పెద్ద ఎత్తున బారికేడ్లు, ఇనుప కంచెలను ఏర్పాటు చేశారు. సింఘు, టిక్రి సరిహద్దులను మూసివేశారు. ఈ క్రమంలో ఢిల్లీ సరిహద్దుల్లో భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. గురువారం నుంచి బోర్డు పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో సీబీఎస్ఈ విద్యార్థులకు అడ్వైజరీ జారీచేసింది. ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో విద్యార్థులు ముందుగానే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, మెట్రో సర్వీసులను వినియోగించుకోవాలని సూచించింది.

నేడు మూడో దఫా చర్చలు

ప్రతిష్టంభనను తొలగించేందుకు కేంద్ర మంత్రులు గురువారం చండీగఢ్‌లో మరోసారి రైతు నేతలతో సమావేశం కానున్నారు. కేంద్రమంత్రులు అర్జున్‌ముండా, పీయూష్ గోయల్, నిత్యానంద్‌రాయ్‌తో సాయంత్రం ఐదు గంటలకు చర్చలు జరుపునున్నట్టు రైతు నాయకుడు శర్వాణ్ సింగ్ తెలిపారు. కేంద్రానికి రైతు సంఘాలకు మధ్య ఇది మూడో దఫా సమావేశం. ఇప్పటికే రెండు సార్లు చర్చలు జరిపినప్పటికీ పలు అంశాలపై ఏకాభిప్రాయానికి రాలేకపోయారు.

రైతులపైకి సోనిక్ ఆయుధం!

- అన్నదాతల కర్ణభేరిని దెబ్బతీసే కుయుక్తి
- అమెరికా నుంచి ఐదు ఎల్ఆర్ఏడీల కొనుగోలు
- ఢిల్లీ సరిహద్దుల్లో ఉద్రిక్తంగా రైతుల ఆందోళన

న్యూఢిల్లీ: పంటలకు మద్దతు ధరపై చట్టం, స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు తదితర డిమాండ్ల సాధన కోసం దేశ రాజధాని వైపు దూసుకొచ్చిన వేల మంది అన్నదాతలను అడ్డుకొనేందుకు కేంద్ర ప్రభుత్వం పోలీసులకు సరికొత్త ఆయుధాలను అందజేసింది. రైతుల ఆందోళనను భగ్నం చేయడానికి వారి కర్ణభేరిని పగులగొట్టడమే పరిష్కారం అని ప్రభుత్వ పెద్దలు సూచించినట్టు సమాచారం. ఆ క్రమంలోనే పోలీసులు ఈసారి దీర్ఘశ్రేణి అకౌస్టిక్ పరికరాలు (ఎల్ఆర్ఏడీ) లేదా అల్లరి మూకలను నియంత్రించే శబ్ద ఫిరంగులను సరిహద్దుల్లో మోహరించారు. ఈ పరికరాలు ఒకే దిశగా భారీ స్థాయిలో ధ్వనిని విడుదల చేస్తాయి. ఆ ధ్వని ధాటికి నిరసనకారులు తమ వినికిడి శక్తిని కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఈ ఎల్ఆర్ఏడీలను అమెరికా సైన్యం 2000 సంవత్సరంలో తయారుచేసుకుంది. ఢిల్లీ పోలీసులు 2013లో ఒక్కో దానికి రూ.30 లక్షలు వెచ్చించి ఐదు ఎల్ఆర్ఏడీలను అమెరికా నుంచి కొనుగోలు చేశారు. రైతులు సైతం పోలీసుల దాడులను భగ్నం చేసేందుకు సృజనాత్మకంగా ఆలోచిస్తున్నారు. పోలీసులు డ్రోన్ల సాయంతో రైతులపైకి పొగబాంబులను జార విడుస్తుండగా.. డ్రోన్లను నేలకూల్చేందుకు రైతులు పతంగులను ఎగురవేయడం గమనార్హం.

రేపు గ్రామీణ భారత్ బంద్

న్యూఢిల్లీ: కనీస మద్దతు ధరకి చట్టబద్ధతతోపాటు పలు డిమాండ్ల సాధన కోసం దేశ రాజధాని ఢిల్లీని ముట్టడించిన రైతులు తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తున్నారు. ఈ నెల 16న గ్రామీణ భారత్‌బంద్‌కు పిలుపునిచ్చారు. తమ సమస్యలను ప్రజలకు వివరించి, కేంద్ర ప్రభుత్వ తీరును ఎండగట్టేందుకే భారత్‌బంద్‌కు పిలుపునిచ్చినట్టు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ప్రకటించింది. ఈ బంద్‌కు పలు కేంద్ర కార్మిక సంఘాలు మద్దతు ప్రకటించాయి. 16న ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు బంద్ కొనసాగుతుందని రైతు సంఘాల నేతలు ప్రకటించారు. ఆ రోజు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జాతీయ రహదారులను స్తంభింపజేస్తామని తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక

- అబుదాబిలో తొలి హిందూ ఆలయాన్ని ప్రారంభించిన మోదీ
- భూమి ఇచ్చిన ముస్లిం రాజు
- ఆర్కిటెక్ట్ క్రిస్టియన్.. నిర్మాణ సంస్థ పార్సీలది

అబుదాబి: యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) రాజధాని నగరం అబుదాబికి సమీపంలో హిందూ దేవాలయాన్ని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ ఈ ఆలయం మత సామరస్యానికి చిహ్నంగా వర్ధిల్లుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. బోచాసన్‌వాసీ శ్రీ అక్షర్ పురుషోత్తమ్ స్వామినారాయణ్ సంస్థ (బీఏపీఎస్) ఈ దేవాలయాన్ని నిర్మించింది. ఇది అబుదాబిలో తొలి రాతి హిందూ దేవాలయం కావడం విశేషం.

భారత్, అరబ్ దేశాలు సంయుక్తంగా ఈ ఆలయాన్ని నిర్మించాయి. హిందూ మతంలోని వైష్ణవుడైన స్వామి నారాయణ సంప్రదాయానికి చెందిన బోచసన్యాసి అక్షర్ పురుషోత్తం స్వామి నారాయణ సంస్థ (బీఏపీఎస్) ఈ ఆలయాన్ని నిర్మించింది. ఈ ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమిలో 13.5 ఎకరాల భూమిని ముస్లిం రాజు అయిన షేక్ మహ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ బహుమతిగా ఇచ్చారని బీఏపీఎస్ ప్రతినిధి తెలిపారు. మత సామరస్యానికి ప్రతీకగా ఈ ఆలయానికి వాస్తు శిల్పిగా క్యాథలిక్ క్రిస్టియన్.. ప్రాజెక్ట్ మేనేజర్‌గా సిక్కు మతస్థుడు ఉన్నారు. ఫౌండేషన్ డిజైనర్ బుద్దిస్ట్ కాగా, నిర్మాణ సంస్థ పార్సీలకు చెందినది. డైరెక్టర్ జైన మతానికి చెందిన వ్యక్తి అని బీఏపీఎస్ ప్రతినిధి వెల్లడించారు.

ఆలయ ప్రత్యేకతలు

ఈ ఆలయంలో ఏడు శిఖరాలున్నాయి. నాగరా సంప్రదాయ శైలిలో దీన్ని నిర్మించారు. ఆలయ ముందు భాగంలో విశ్వవ్యాప్త విలువలు, విభిన్న సంస్కృతుల సామరస్య కథలు, హిందూ ఆధ్యాత్మిక వేత్తలు, వారి అవతారాల వర్ణనలు ఉన్నాయి. ఈ ఆలయం ఎత్తు 108 అడుగులు, పొడవు 262 అడుగులు, వెడల్పు 180 అడుగులు. బయటి ముఖభాగంలో రాజస్థాన్ నుంచి తెచ్చిన గులాబీ ఇసుకరాయిని ఉపయోగించగా.. లోపలి భాగంలో ఇటాలియన్ పాలరాతిని ఉపయోగించారు. ఈ ఆలయంలో రెండు కేంద్ర గోపురాలున్నాయి. డోమ్ ఆఫ్ హార్మోని, డోమ్ ఆఫ్ పీస్‌గా వీటిని పేర్కొంటున్నారు. భూమి, నీరు, అగ్ని, గాలి, మొక్కలను చెక్కటం ద్వారా మానవ సహజీవనాన్ని తెలియచేశారు. ఏ వాల్ ఆఫ్ హార్మోని.. అరబ్ ఎమిరేట్స్‌లోని అతిపెద్ద 3డీ ప్రింటెడ్ గోడలలో ఒకటి. ఆలయ నిర్మాణానికి సంబంధించిన కీలక మైలురాళ్లను వీడియో రూపంలో ఈ గోడపై ప్రదర్శిస్